సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 26 । జూన్ । 2023



క్యూ వద్దు.. క్యూఆర్ ముద్దు

టెక్కలి జిల్లా ఆస్పత్రిలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఓపీ సులభం కానుంది. - 8లో



ఉద్యోగులకు స్నేహహస్తం

ఉద్యోగులు జిల్లా ప్రజా ప్రతినిధులను సన్మానించారు. ప్రభుత్వం చేసిన మేలును కొనియాడారు. - 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	34°	25°
ఇచ్ఛాపురం	35°	24°
పాతపట్నం	35°	26°
శ్రీకాకుళం	35°	26°

న్యూస్‌రీల్

శ్రీముఖలింగేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు రేపు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలోని హుండీ ఆదాయాన్ని మంగళవారం ఉదయం ఆలయ ఆవరణలో లెక్కించనున్నామని ఈఓ పి.ప్రభాకరరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల భక్తులు హుండీ లెక్కింపులో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మంటల్లో దగ్ధమైన పాత కార్యాలయం



పాత ఎంపీడీఓ కార్యాలయంలో ఎగసి పడుతున్న మంటలు

పొందూరు: మండల కేంద్రంలోని శిథిలావస్థలో ఉన్న పాత ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. సాయంత్రం కార్యాలయంలోని ఒక వైపు నుంచి మంటలు చెలరేగాయి. ఆదివారం సెలవు కావడంతో కార్యాలయంలో సిబ్బంది ఎవరూలేరు. కార్యాలయం ముందు నుంచి వెళ్తున్న వారు మంటలను గమనించి అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు అదుపు చేశారు. అయితే కార్యాలయంలో ఉంచిన రికార్డులు మాత్రం కాలిపోయాయి. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఆదిత్యాయ నమోస్తుతే



సూర్యనమస్కార పూజలను చేస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి ఆదిత్యుని ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి కేశఖండన శాలలో తలనీలాలను సమర్పించుకుని మొక్కులను చెల్లించుకున్నారు. అలాగే ప్రత్యేక ప్రసాదాలను స్వామికి నివేదించి ఆరోగ్యాన్ని ప్రసాదించమని మొక్కుకున్నారు. అనంతరం స్వామి దర్శనానికి వెళ్లి గోత్రనామాలతో పూజలు జరిపించుకున్నారు. భక్తుల కోసం ఆలయంలో ఉచిత ప్రసాదాల పంపిణీ, మంచినీటి ప్యాకెట్లతో పాటు ఉచిత మజ్జిగ పంపిణీ తదితర చర్యలను ఆలయ ఈఓ హరిసూర్యప్రకాష్ చేపట్టారు. ఉదయం 10 గంటల నుంచి భక్తుల సంఖ్య పెరగడంతో తగిన ఏర్పాట్లు చేసి ప్రత్యేక, విశిష్ట దర్శనాల ద్వారా దర్శనాలకు అవకాశమిచ్చారు. వివిధ దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ.3,12,100, విరాళాల ద్వారా రూ.84,012, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.55 లక్షల మేరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ హరిసూర్యప్రకాష్ తెలిపారు.

'సంక్షేమ పథకాలు వినియోగించుకోండి'



మాట్లాడుతున్న జిల్లా ఈసీహెచ్ఎస్ అధికారి ఎం.నారాయణరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: మాజీ సైనికులు, వితంతువులు, వారి కుటుంబ సభ్యులు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఈసీహెచ్ఎస్ అధికారి, విశ్రాంత కల్నల్ మెండ నారాయణరావు సూచించారు. శ్రీకాకుళం నగరంలోని పెద్దరెల్లి వీధిలో ఆదివారం మాజీ సైనికుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ ఈసీహెచ్ఎస్‌లో రోజురోజుకూ మారుతున్న పాలసీ విధానాలు, మెడిసిన్ సప్లయ్ సమస్యలు, హాస్పిటల్ పనితీరు, స్థితిగతులను వివరించారు. క్యాంటీన్ పాలసీ విధానాలను మేనేజర్ తర్రా కృష్ణారావు వివరించారు. అనంతరం మీజీ సైనికులు, వితంతువులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికుల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు తమ్మినేని కృష్ణారావు, జిల్లా అధ్యక్షుడు కె.పూర్ణచంద్రరావు, వి.సూర్యనారాయణ, జిల్లా మాజీ సైనికుల సమాఖ్య చైర్మన్ గ్రూప్ కెప్టెన్ పి ఈశ్వరరావు(రిటైర్డ్), జనరల్ సెక్రటరీ ఎస్.రామారావు, జాయింట్ సెక్రటరీ పి.మురళీధర్‌రావు, ట్రెజరర్ ఐ.దిల్లేశ్వరరావు, సలహారులు పి.రామారావు, ఎస్.లక్ష్మణరావు, బి.మూర్తి, మహిళా సెక్రటరీ పి.పద్మావతి, కె.జగ్గమ్మ, కె.అన్నపూర్ణ, మాజీ సైనిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

● వైభవం



బలగ నాగావళి నది ఒడ్డున బాలాత్రిపుర కాలభైరవ పీఠంలో జరుగుతున్న వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దీపోత్సవం కనుల పండువగా నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో అర్చనలు చేశారు. - శ్రీకాకుళం కల్చరల్

● వామనావతారం..



జగన్నాథ స్వామి ఆదివారం వామనావతారంలో దర్శనమిచ్చారు. సోంపేట పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. - సోంపేట

● వానందం



సిక్కోలులో వానలు విస్తరిస్తున్నాయి. మెళియాపుట్టి, నరసన్నపేట, పాతపట్నం మండలాల్లో ఆదివారం జల్లులు కురిశాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. నరసన్నపేటలో వీధులు జలమయమయ్యాయి. పాతపట్నం పరిసర పల్లెల్లో భారీ వాన కురిసింది. - మెళియాపుట్టి, నరసన్నపేట, పాతపట్నం

ప్రత్యేక శ్రద్ధ



భవిత కేంద్రం

- పాఠశాలల్లో భవిత కేంద్రాల విలీనానికి ప్రభుత్వం కసరత్తు
- సాధారణ విద్యార్థులతో కలిపి విద్యా బోధన
- జిల్లాలో 2,669 మంది దివ్యాంగ చిన్నారులు

నరసన్నపేట: దివ్యాంగ చిన్నారులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఇన్నాళ్లూ భవిత కేంద్రాల్లో వీరికి విద్యా బోధన చేసే వారు. ఇప్పుడు ఆ భవిత కేంద్రాలను పాఠశాలల్లో విలీనం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. దివ్యాంగ చిన్నారులను సాధారణ విద్యార్థులతో కలిపి బోధించడానికి, వారిని శారీరకంగా, మానసికంగా బలవంతులు చేయడానికి కసరత్తు జరుగుతోంది. పాఠశాలల్లో భవిత కేంద్రాల విలీనం వల్ల దివ్యాంగ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, వసతి సమస్య తీరుతుంది. జిల్లాలోని 30 మండలాల్లో 17 స్కూల్స్‌లోనూ మిగిలిన 13 భవిత కేంద్రాల్లోనూ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. 13 భవిత కేంద్రాలను సమీప పాఠశాలల్లో విలీనం చేయడానికి తరగతి గదులను కేటాయిస్తూ సంబంధిత అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. త్వరలోనే ఆయా పాఠశాలల్లో విలీనం చేయనున్నారు.

30 భవిత కేంద్రాలు..

జిల్లాలో 30 మండలాల్లో 30 భవిత కేంద్రాలున్నాయి. వీటికి 2669 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ చిన్నారులకు విద్యా బోధనతో పాటు వారికి అవసరమైన ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, హియరింగ్ థెరపీతో పాటు వివిధ రకాలైన చికిత్సలు అందిస్తున్నారు. అలాగే లైఫ్ స్కిల్స్, బిహేవియర్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను ఐఈడీ ఉపాధ్యాయులు నేర్పిస్తున్నారు. ఈ శిక్షణ కోసం ఐఈడీ ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. దీని కోసం అవసరమైన పరికరాలు కూడా ప్రభుత్వం సమకూర్చుతుంది. వారంలో ఐదు రోజులు కేంద్రాల్లో శిక్షణ అందించడమే కాకుండా ప్రతి శనివారం కేంద్రాలకు రాలేని చిన్నారులకు ఇళ్లకు వెళ్లి ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు.

భోజన సమస్యలకు చెక్..

భవిత కేంద్రాలను పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల వసతి, మధ్యాహ్న భోజన సమస్యలు తీరనున్నాయి. కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులకు సమీపంలోని పాఠశాలల నుంచి మధ్యాహ్న భోజనాన్ని ప్రస్తుతం తీసుకువస్తున్నారు. ఇక నుంచి సమీప పాఠశాలల్లో చేర్చడం వల్ల చిన్నారులకు కావాల్సినంత భోజనం ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ప్రకారం అందుతుంది.

ఏర్పాట్లు చేశాం..



ప్రభుత్వ ఆదేశాల మేరకు భవిత కేంద్రాల్లో దివ్యాంగ పిల్లలకు నిర్వహిస్తున్న ప్రత్యేక క్లాసులను ఇక నుంచి సమీప స్కూల్స్‌లోనే చేపడతాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రతిపాదనలు పంపాం. జూలై నుంచి దివ్యాంగ పిల్లలకు క్లాసులు ఆయా స్కూల్స్‌లోనే నిర్వహిస్తాం. దీని వల్ల వారిలో మానసిక స్థిరత్వం పెరుగుతుంది.

– గోవర్ధనరావు, ఐఈడీ కో ఆర్డినేటర్

విలీనంతో ప్రయోజనం

భవిత కేంద్రాలకు వస్తున్న చిన్నారులను మరింతగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. 13 మండలాల్లో ఉన్న భవిత కేంద్రాలను సమీప ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేయాలని తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో దానికి అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తద్వారా ఆయా పాఠశాలల్లో చదువుతున్న సాధారణ విద్యార్థులతో వీరు కలిసిమెలసి ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. సాధారణ విద్యార్థులతో కలిపి విద్యా బోధన చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలా చేయడంతో శారీరకంగా, మానసికంగా వారు మరింత అభివృద్ధి చెందుతారన్నది అధికారుల అభిప్రాయం.

● కన్నపేగును కలిసిన వేళ

పదిహేనేళ్లుగా ఆ మాతృమూర్తి కొడుకును చూడలేదు.. తన ఇంటికి వెళ్లలేదు.. కుటుంబాన్ని కలవలేదు. మరోవైపు ఇన్నాళ్లుగా ఆ కొడుకు అమ్మను వెతుకుతూనే ఉన్నాడు. నేడో, రేపో తల్లి ఇంటికి రాకపోదా అని ఆశగా ఎదురుచూస్తూనే ఉన్నాడు. అనునిత్యం అమ్మ కోసం తాపత్రయపడ్డాడు. 15 ఏళ్ల ఎడబాటు తర్వాత ఆ తల్లీకొడుకులు మళ్లీ కలిశారు. మతిస్థిమితం కోల్పోయిన ఆ తల్లి అయినవాళ్లందరికీ దూరమైపోగా స్వచ్ఛంద సంస్థల సహకారంతో మళ్లీ మామూలు మనిషై కన్నపేగును కలుసుకుంది. వివరాల్లోకి వెళితే..



వృద్ధాశ్రమంలో ఉన్న తల్లిని తీసుకెళ్తున్న కుమారుడితో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు గ్రామానికి చెందిన గండుపల్లి లక్ష్మి(55) పదిహేనేళ్ల కిందటి వరకు అందరి లాగానే సాధారణ గృహిణిగా జీవితం గడిపేవారు. భర్త, కుమారుడితో కలిసి సంతోషంగా ఉండేవారు. అయితే భర్త మరణంతో ఆమె మానసిక స్థితి దారి తప్పింది. ఆ ఒత్తిడిలో కొడుకు కామదాసును విడిచిపెట్టి వెళ్లిపోయింది. మతిస్థిమితం లేకపోవడంతో ఆమె ఎటో వెళ్లిపోయారు. వెతికి పట్టుకోవడం ఇంటి వారికి సాధ్యపడలేదు. రోడ్లపై తిరుగుతున్న ఆమెను రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు ఆదరించి ఆరు నెలలుగా వైజాగ్‌లో చికిత్స చేయించారు. పరిస్థితి కాస్త కుదుటపడిన తర్వాత మనోబంధు సంస్థకు అప్పగించగా.. వారు మూడు రోజుల కిందట మండలంలోని సీతయ్య ఫౌండేషన్ వృద్ధాశ్రమానికి తీసుకువచ్చారు. ఆమెతో పాటు మరో నలుగురు ఇక్కడకు వచ్చారు. వారి నుంచి వివరాలు సేకరించిన ఫౌండేషన్ సభ్యులు పత్రికలు, సోషల్ మీడియాల్లో ఆ వివరాలను వెల్లడించారు. ఆ సమాచారం మొగల్తూరులోని కామదాసుకు చేరడంతో తన తల్లి కంచిలి మండలంలో ఉందని తెలిసి సంతోషపడ్డాడు. రెడ్‌క్రాస్ సభ్యులను సంప్రదించి కంచిలి మండలానికి వచ్చి ఆదివారం తల్లిని కళ్లారా చూశాడు. ఆమె కూడా కొడుకును గుర్తు పట్టడంతో ఆ ఉద్వేగ సన్నివేశాన్ని చూసి స్థానికులు కంటనీరు పెట్టుకున్నారు. అనంతరం ఆయన తన తల్లిని స్వగ్రామానికి తీసుకువెళ్లాడు. తల్లీకొడుకులను కలిపిన మనోబంధు సంస్థ కన్వీనర్ బీన ఢిల్లీరావు, సూపర్‌వైజర్ పాల సురేష్, రెడ్‌క్రాస్ సంస్థ షెల్టర్ మేనేజర్ ఎ.మురళి, సీతయ్య ఫౌండేషన్ సభ్యుడు సానా గణేష్‌లకు సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుళ్ల రమేష్–మోహనరావులు ధన్యవాదాలు తెలిపారు. – కంచిలి

ఐదు దేవాలయాల్లో చోరీ



చోరీ జరిగిన త్రినాథ స్వామి ఆలయంలో క్లూస్‌టీమ్ పరిశీలన

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామంలో శనివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఒక్క రోజులోనే ఐదు దేవాలయాల్లో చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తులు, దేవాలయ అర్చకులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామంలో గల ఉమాకామేశ్వరస్వామి, త్రినాథస్వామి, కోదండరామస్వామి, సంతోషి మాత, మండలమ్మతల్లి దేవాలయాల్లో దొంగలు చొరబడి దేవుని ఆభరణాలు, పూజా సామగ్రి, హుండీలోని నగదు, బంగారు కానుకలు దోచుకున్నారు. ఆదివారం ఉదయం ఆలయాలు తెరిచిన అర్చకులకు చోరీ జరిగిన ఆనవాళ్లు కనిపించాయి. ఉమాకామేశ్వరస్వామి ఆలయంలో వెండి కిరీటం, వెండి పంచపాత్ర, వెండి ఉద్ధరిణి, వెండి పళ్లెం, పార్వతీదేవి అమ్మవారికి అలంకరణ చేసిన బంగారం నేత్రాలు, అమ్మవారి పుస్తెలు, త్రినాథ స్వామి ఆలయంలో స్వామి వారి బంగారు నేత్రాలు తులం, వెండి పల్లెం, ఉద్ధరిణితో పాటు హుండీలోని నగదు, కోదండరామస్వామి ఆలయంలో స్వామి అలంకరణ చేసిన వెండి కిరీటాలు, వెండి పూజా సామగ్రి సుమారు కిలో వరకు దోచుకున్నట్లు ఆలయ అర్చకులు తెలియజేశారు. మండలమ్మ తల్లి ఆలయం, సంతోషిమాత ఆలయాల్లో హుండీలను పగలగొట్టి అందులో ఉన్న నగదును దొంగలు అపహరించారు. ఈ ఐదు దేవాలయాల్లో చోరీకి పాల్పడిన నగదు, బంగారు, వెండి ఆభరణాల విలువ సుమారు రూ. 4 లక్షల వరకు ఉంటుందని అంచనా. దేవాలయాలకు వేసి ఉన్న తాళాలను పగలగొట్టి దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు.

గతంలో కూడా ఉమాకామేశ్వరస్వామి ఆలయం, మండలమ్మ తల్లి ఆలయాల్లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులకు విషయం తెలియడంతో క్లూస్‌టీమ్ వచ్చి పరిశీలన చేసి వేలిముద్రలు సేకరించారు. ఈ చోరీ సంఘటనలపై స్థానిక ఎస్‌ఐ కూటికుప్పల కృష్ణప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమష్టి కృషితోనే వర్సిటీ ప్రగతి

- జీఆర్‌ఏయూ వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు
- ఘనంగా విశ్వ విద్యాలయం వార్షికోత్సవం



వ్యవస్థాపక దినోత్సవ న్యూస్ బులిటెన్ విడుదల చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: అందరి కృషితోనే బీఆర్‌ఏయూ ప్రగతి సాధిస్తోందని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం 16వ వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం వర్సిటీలో నిర్వహించారు. ఈ సందర్భంగా సెమినార్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వీసీ మాట్లాడుతూ 15 ఏళ్లు పూర్తిచేసుకున్న విశ్వవిద్యాలయం సీనియర్ వర్సిటీలతో పోటీ పడి మంచి విద్యను అందజేస్తోందని తెలిపారు. విశ్వ విద్యాలయంలో పీజీ కోర్సులతో పాటు అనుబంధంగా 120 డిగ్రీ, పీజీ, బీఎడ్, డీపీఈడీ, బీపీఈడీ కళాశాలలు ఉన్నాయని చెప్పారు. భవిష్యత్‌లో నాక్ ఏ ప్లస్ గ్రేడ్ లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. పరిశోధనాత్మక విద్య, ఆవిష్కరణలే లక్ష్యంగా సాగుతున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న ఉన్న సిబ్బందితోనే పీజీ కోర్సులు, డిప్లమా, సర్టిఫికెట్, ఆన్‌లైన్ శిక్షణ కోర్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వర్సిటీలో పూర్తి స్థాయి మౌలిక వసతులు, ప్రమాణాల విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ సహకారం, అంతర్గత వనరులతో వర్సిటీ ముందుకు సాగుతోందని అన్నారు. అందరి సహకారంలో వర్సిటీ భవిష్యత్‌లో జాతీయ స్థాయిలో ఉత్తమ వర్సిటీగా మారుతుందని అన్నారు. బయోటెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.లోకేశ్వరి రూ.లక్ష కార్పస్ ఫండ్ అందజేశారని, ఈ వడ్డీతో ఏటా బయోటెక్నాలజీలో ప్రథమ స్థానం విద్యార్థికి గోల్డ్ మెడల్ అందజేయనున్నట్లు వివరించారు. స్థానిక వర్సిటీకి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకారం అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, ప్రొఫెసర్ చింతాడ రాజశేఖర్, ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.అనురాధ పాల్గొన్నారు. వర్సిటీలోని జర్నలిజం విభాగం రూపొందించిన వ్యవస్థాపక దినోత్సవ న్యూస్ బులెటిన్ విడుదల చేశారు.

సిక్కోలు లెజెండ్ రాజగోపాలరావు

- బొడ్డేపల్లి శత జయంతి ఉత్సవాలకు సీఎం చొరవ అభినందనీయం: స్పీకర్ తమ్మినేని సీతారాం
- వంశధార ప్రాజెక్టు రాజగోపాలరావు చలవే: మంత్రి ధర్మాన
- ఘనంగా బొడ్డేపల్లి శతజయంతి ఉత్సవాల ముగింపు



బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహం ఆవిష్కరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



ముగింపు సభలో స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి ధర్మాన ప్రసాదరావు, జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ రాధిక తదితరులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా బొడ్డేపల్లి రాజగోపాలరావు సేవలు అందించారని, ఆయన సిక్కోలు లెజెండ్ అని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆరుసార్లు పార్లమెంట్‌కు ఎన్నికయ్యారని, విజయనగరం రాజులపైనా ఇండిపెండెంట్‌గా పోటీ చేసి విజయం సాధించారని గుర్తు చేశారు. బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి ముగింపు ఉత్సవాలను కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ కూడలిలో రాజగోపాలరావు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో స్పీకర్ మాట్లాడారు. బొడ్డేపల్లి శతజయంతి ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహించడం హర్షణీయమన్నారు. రాజగోపాలరావు అడుగుజాడల్లో నడుచుకోవాలని సూచించారు.

రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ విశిష్ట వ్యక్తి బొడ్డేపల్లి రాజగోపాలరావు అని, ఆయన శత జయంత్యుత్సవాలను వందరోజుల పాటు నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. బొడ్డేపల్లి ఔన్నత్యాన్ని కొత్త తరానికి తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు అవసరమని తెలిపారు. వంశధార ప్రాజెక్ట్‌కు బొడ్డేపల్లి రాజగోపాల్ పేరు పెట్టాడం వైఎస్సార్ చలువేనన్నారు. వంశధార ప్రాజెక్టు రాజగోపాలరావు చలవేనని తెలిపారు. తనకు 26 ఏళ్ల వయసు ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా పోటీ చేయించాలని తన గురువు డోల సీతారాంకు బొడ్డేపల్లి చెప్పారని గుర్తు చేసుకున్నారు. 1989లో మంత్రి అయినప్పుడు శుభాకాంక్షలు చెప్పారని అన్నారు. నాలుగేళ్లలో సీఎం ఎన్నో అభివృద్ధి పనులు చేశారని, వాటిని ఓర్వలేకే ప్రతిపక్షం విమర్శలు చేస్తోందని అన్నారు. మూలపేట పోర్టు, బుడగట్లపాలెం హార్బరు పూర్తయితే స్థానికంగానే ఉపాధి దక్కుతుందన్నారు.

ఎంపీ కె.రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ బొడ్డేపల్లి రాజగోపాలరావు సిక్కోలు కీర్తిని చాటిచెప్పారన్నారు. శ్రీకాకుళం యువత ఆయన అడుగుజాడల్లో నడుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధికతో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్యే కంబాల జోగులు, మాజీ ఎంపీ కిల్లి కృపారాణి మాట్లాడుతూ బొడ్డేపల్లి సేవలను గుర్తు చేసుకున్నారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ మాట్లాడుతూ వంశధార ప్రాజెక్టు తీసుకొచ్చిన రాజగోపాలరావు విగ్రహం పక్కన జలగం వెంగళరావు విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, పార్టీ నాయకులు పిరియా సాయిరాజ్, దువ్వాడ వాణి రోణంకి గోపాలకృష్ణ, హనుమంతు కృష్ణారావు, కూన రవి, బొడ్డేపల్లి సత్యవతి, పైడి వేణుగోపాలరావు, పైడి మహేశ్వరరావు, సువ్వారి గాంధీ, కిల్లి మన్మధరావు, బల్ల గిరిబాబు, చింతాడ రామ్మోహన్‌రావు, కోత తిరుమలరావు, పూడి తిరుపతిరావు, చౌదరి పురుషోత్తంనాయుడు, సీఐటీయూ గోవిందరావు, పేడాడ రమణి, కిల్లి వెంకట సత్యనారాయణ, ధానేటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొడ్డేపల్లి నేతాజీ రచించిన బొడ్డేపల్లి రాజగోపాలరావు జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఉల్లాసంగా ఆట్యా–పాట్యా జిల్లా జట్ల ఎంపికలు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఆట్యా–పాట్యా జిల్లా జట్ల ఎంపికలు ఉల్లాసంగా జరిగాయి. జిల్లా సమన్వయకర్త బాడాన నారాయణరావు ఆధ్వర్యంలో అండర్–14 విభాగంలో నిర్వహించిన ఎంపికల్లో ఒక్కో జట్టుకు 14 మంది చొప్పున బాల బాలికలను ఎంపిక చేశారు. వీరంతా వచ్చే నెల 1,2 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లా తునిలో జరగనున్న రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఈ ఎంపికల్లో కేకే రామిరెడ్డి, జగ్గమ్మ, లక్ష్మణరావు, రాజా, వెంకటేశ్వరరావు, నీలకంఠేశ్వరరావు, రఘునాథరావు, అలివేలు, రాణి, శ్యామలరావు, జానకి తదితర వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆట్యా–పాట్యా బాలబాలికల జిల్లా జట్లు

క్లుప్తంగా

ముఖలింగేశ్వరుని సన్నిధిలో దేవదాయ శాఖ అధికారి



ఆలయ ఆవరణలో చంద్రశేఖర్ తదితరులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరుని జిల్లా దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారి చంద్రశేఖర్ ఆదివారం దర్శించుకున్నారు. అర్చకులు స్వామికి ఏకవార అభిషేకాలతోపాటు వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందించి పుణ్యాహవచనాలతో దీవించారు.

తలసముద్రం సర్పంచ్ మృతి



శ్రీనివాసరావు (ఫైల్ ఫొటో)

పోలాకి: తలసముద్రం సర్పంచ్ భావన శ్రీనివాసరావు(వైఎస్సార్ సీపీ) ఆదివారం ఉదయం విశాఖలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో మృతిచెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాసరావు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. శ్రీనివాసరావు తొలి నుంచి వైఎస్సార్‌సీపీలో చురుగ్గా ఉండేవారు. ఆయన భార్య సుజాత గతంలో ఎంపీటీసీ సభ్యురాలిగా సేవలందించారు. వీరికి ఇద్దరి కుమారులు ఉన్నారు. శ్రీనివాసరావు మృతిపై ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సంతాపం వ్యక్తం చేశారు.

ఢిల్లీలో మెరిసిన ఉద్దానం యువకుడు



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న మద్దిల నితిన్

కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంతం పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన మద్దిల నితిన్ మార్షల్ ఆర్ట్స్(కరాటే)లో గోల్డ్ మెడల్ సాధించాడు. ఢిల్లీలో ఆదివారం జరిగిన 24వ సీనియర్ స్క్వే మార్షల్ ఆర్ట్స్ నేషనల్ చాంపియన్‌షిప్–2023–24లో గోల్డ్ మెడల్ సాధించాడు. తల్లిదండ్రులు మద్దిల తాతారావు, దమయంతిలు అండమాన్‌లో ఉపాధి రీత్యా నివాసం ఉండటంతో అండమాన్ దీవి తరపునే ఈ యువకుడు పాల్గొని విజేతగా నిలిచాడు. ఈ సందర్భంగా బొడ్డపాడు, అండమాన్ ప్రాంత వాసులు అభినందనలు తెలిపారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,180–00
బంగారం(22సి. 10గ్రా.)	54,250–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹270	₹ 280

'క్యూ' వద్దు.. 'క్యూఆర్' ముద్దు!



ఓపీ విభాగంలో అంటించి ఉన్న క్యూర్ కోడ్స్

టెక్కలి రూరల్: ఆస్పత్రిలో ఓపీ కోసం క్యూలో నించునే రోజులు ఇక కనిపించవు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఆదేశాల మేరకు టెక్కలి జిల్లా ఆస్పత్రిలో రోగులకు అందుబాటులో ఆన్‌లైన్ సేవలు తీసుకువచ్చారు. ఓపీ విభాగంలో రోజురోజుకూ రోగుల సంఖ్య పెరుగుతుండటంతో ఆన్‌లైన్ సేవలను ఆశ్రయిస్తున్నారు. ఇవి పూర్తిస్థాయిలో మరో ఒకటి, రెండు రోజుల్లో అందుబాటులోకి వస్తాయి.

వినియోగం ఎలా..?

- ఆధార్ లింక్ ఉన్న స్మార్ట్‌ఫోన్ ద్వారా ప్లే స్టోర్‌లో అభ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ యాప్‌లో లాగిన్ అవ్వాలి.
- అనంతరం ఆస్పత్రికి వచ్చే సమయంలో ఆస్పత్రి క్యూ వద్ద ఉన్న క్యూఆర్ కోడ్‌స్కాన్ చేస్తే చాలు రోగి ఓపీ నమోదైపోతుంది.
- అనంతరం ఓపీ విభాగంలో ఉండే వ్యక్తి వారి సమస్యను బట్టి సంబంధిత వైద్యుల వద్ద ఉండే కంప్యూటర్‌కి లింక్ ఫార్వర్డ్ చేస్తారు.
- ఆ తర్వాత ఓపీ రశీదు రోగికి ఇచ్చి పంపిస్తారు.
- అనంతరం రోగి సంబంధిత వైద్యుడి వద్దకు వెళ్లి తనకి ఇచ్చిన రశీదు నంబర్ చెప్పి తన సమస్యను వివరించవచ్చు.
- వైద్యుడు ఆ రోగిని పరిశీలించి దానికి సంబంధించిన ల్యాబ్‌కి గాని, మెడిసిన్ విభాగానికి గాని ఆ రోగి డేటాను ఫార్వర్డ్ చేస్తారు.
- తర్వాత రోగి అక్కడకు వెళ్లి మందులు తీసుకోవచ్చు.
- అనంతరం ఆ రోగి డేటా ఆన్‌లైన్‌లో నమోదవుతుంది.
- ఈ విధానం వల్ల చాలా సమయం ఆదా అవుతుంది. ఎక్కువ మందికి సేవలు అందించేందుకు వీలవుతుంది.
- అత్యవసర సమయాల్లో ఓపీ గురించి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండదు.
- దీనికి సంబంధించి టెక్కలి ఆస్పత్రిలో 40 కంప్యూటర్స్ ఉన్నాయని, ఇప్పటికి 90 శాతం పనులు పూర్తయ్యాయని, సోమవారం నుంచి సేవలు అందుబాటులోకి వస్తాయని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

ABHA

రోగులు డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన అభ యాప్

ఉద్యోగులకు స్నేహహస్తం

- కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ నిర్ణయం చరిత్రాత్మకం
- ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం
- 2050 వరకు రాష్ట్రానికి జగనే సీఎం: కాంట్రాక్ట్ ఉద్యోగులు



మాట్లాడుతున్న రాష్ట్ర శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, పక్కనే ధర్మాన సోదరులు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేయడంతోపాటు వారికి స్నేహ హస్తాన్ని అందించే దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎల్లప్పుడూ ఆలోచన చేస్తున్నారని రాష్ట్ర శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళావేదిక వేదికగా ఇంటర్మీడియెట్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు, ఇతర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు ఆదివారం నిర్వహించిన 'థాంక్యూ సీఎం సార్' కార్యక్రమంలో సభాపతి సీతారాం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు క్రమబద్ధీకరణకు నాలుగేళ్లుగా శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేశారన్నారు. ఇప్పుడు మిగిలిపోయిన వారికి కూడా త్వరలోనే న్యాయం జరుగుతుందన్నారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ భావితరాలను దృష్టిలో ఉంచుకుని సీఎం జగన్ అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారని చెప్పారు. గత పాలకులకు, ప్రస్తుత జగన్ పాలనను పోల్చిచూడాలన్నారు. మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం సీఎం జగన్ నైజమన్నారు. అందుకు తన కేబినెట్ మంత్రి దక్కడమే ఒక ఉదాహరణగా చెప్పుకొచ్చారు. కాంట్రాక్ట్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఎస్.దొరబాబు, ఐ.వేణుగోపాల్, అలుగోలు సురేష్, డబ్బీరు సాయిప్రసాద్, పూజారి మన్మధరావు, కె.రవిబాబు, రౌతుగోపి, డి.రాంప్రసాద్, పి.నారాయణరావు, సీర గోవిందరావు, కేవీ రమణమూర్తి, బి.మురళి, సత్యనారాయణ, ఇలపండ మాధవరావు,కేఆర్ ఠాగూర్ తదితరులు మాట్లాడుతూ తమ సుదీర్ఘ సేవలను గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి, మంత్రి మండలికి కృతజ్ఞతలు తెలిపారు. థాంక్యూ సీఎం సార్ అంటూ నినదించారు. తమ జీవితాలు, కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. 2050 వరకు జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకుంటామన్నారు.

ఏపీ ఎన్జీఓ శ్రీకాకుళం జిల్లా సంఘ అధ్యక్షుడు హనుమంతు సాయిరాం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏపీఎన్‌జీఓ సంఘం సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరకు సూరిబాబు, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ యువ నేతలు తమ్మినేని వెంకట చిరంజీవి నాగ్, మెంటాడ స్వరూప్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు.

'కుల తత్వం రూపుమాపాలి'



పుస్తకావిష్కరణలు చేస్తున్న గరికపాటి, అతిథులు

శ్రీకాకుళం కల్చరల్: సమాజంలో కులతత్వం, అంటరానితనం రూపుమాపాలని ప్రముఖ అవధాని, ప్రవచన కర్త గరికపాటి నరసింహారావు అన్నారు. శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల సామాజిక సమతా సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించింది.

ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ అణగారిన వర్గాలలో ఎందరో మహర్షులు పుట్టారని గుర్తుచేశారు. అన్ని వృత్తుల వారిని గౌరవించాలన్నారు. స్వాగత సమితి కన్వీనర్ బారల వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో రిటైర్డ్ వైస్ చాన్సలర్ హనుమంతు లజపతిరాయ్, మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ, ఉత్తరాంధ్ర సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద, వేదిక జాతీయ నాయకులు శ్యాంప్రసాద్, ఆంధ్రావిశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు, ఆర్ఎస్ఎస్ సహ ప్రాంత ప్రచారక్ జనార్దన్‌లు మాట్లాడుతూ సమసమాజ నిర్మాణానికి అందరూ ముందుకు రావాలన్నారు. ముందుగా డాక్టర్ లజపతిరాయ్ రచించిన 'నన్ను చెక్కిన శిల్పాలు', రచయిత భమిడిపాడి గౌరీశంకర్ రచించిన 'ఉత్తరాంధ్ర సమరత ఆ సారథులు' పుస్తకాలను ఆవిష్కరించారు.

జిల్లా అండర్–7 చెస్ ఎంపిక పోటీలు రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి అండర్–7 బాలబాలికల చెస్ ఎంపిక పోటీలు ఈ నెల 27వ తేదీన ఉదయం 9 గంటల నుంచి జిల్లా చెస్ అసోసియేషన్ కోచింగ్ సెంటర్‌లో జరగనున్నట్టు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బగాది కిషోర్ తెలిపారు. ఈ ఎంపికలకు ఏడేళ్లలోపు వయస్సు కలిగిన బాలబాలికలు హాజరుకావాలన్నారు. ఇక్కడ గెలుపొందిన క్రీడాకారులను ఈనెల 28 నుంచి విజయనగరంలో జరిగే రాష్ట్ర పోటీలకు పంపిస్తామని ఆయన చెప్పారు. జిల్లా ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు మరిన్ని వివరాల కోసం రాష్ట్ర కార్యదర్శి సనపల భీమారావు 9491802386 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

విత్తన శుద్ధితోనే చక్కటి దిగుబడి



విత్తన శుద్ధి చేస్తున్న రైతులు

ఆమదాలవలస రూరల్: ఖరీఫ్ పనులు మొదలైపోయాయి. సబ్సిడీపై విత్తనాలు పొందిన రైతులు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వ్యవసాయానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేయడంతో ఇప్పటికే గ్రామాల్లో సబ్సిడీ విత్తనాలు రైతుల చెంతకు చేరాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఏ రకం విత్తనాలు కావాలో ముందుగానే ఆర్డర్ చేసుకోవడం వల్ల ప్రతి రైతుకు సకాలంలో విత్తనాలు అందాయి. రైతులకు సరఫరా చేసిన విత్తనాలను విత్తన శుద్ధి చేసుకుంటే దిగుబడులు సాధించుకోవచ్చునని శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కిలో విత్తనానికి గ్రాము కార్బండిజమ్ లేదా 2.5 గ్రాములు మాంకోజెట్ కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. విత్తన శుద్ధిలో తగిన మోతాదులో మందులు వాడాలి. మోతాదు మించితే విత్తనం మొలక శాతం తగ్గుతుంది. శిలీంధ్ర నాశిని పురుగు మందుతో శుద్ధి చేసిన తర్వాత జీవ రసాయనాలతో మరోసారి శుద్ధి చేయాలి. గింజ పగలకుండా, పై పొర పోకుండా చూసుకోవాలి. చేతులకు గ్లౌజులు, ముఖానికి వస్త్రం కట్టుకోవాలని ఆమదాలవలస వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు సూచించారు. విత్తన శుద్ధితో తెగుళ్లు, పురుగును సమర్థంగా నివారించవచ్చు.

'రోడ్డు పనుల్లో నాణ్యత ప్రధానం'



రోడ్డు పనులు పరిశీలిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ), శ్రీకాకుళం రూరల్: రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తప్పవని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో డే అండ్ నైట్ కూడలి నుంచి ఆమదాలవలస రైల్వే స్టేషన్ వరకూ చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ రోడ్డుకు ఎంతో ప్రాధాన్యం ఉందని రైల్వే స్టేషన్‌కు రాకపోకలు సాగించేవారు, వీరఘట్టం వైపు నుంచి రాయగఢ వెళ్లేవారికి, అలానే బత్తిలి నుంచి ఒడిశా వైపునకు వెళ్లేవారంతా ఈ రోడ్డులో ప్రయాణిస్తుంటారని నాణ్యతతో పనులు చేపట్టాలన్నారు. ఈ రోడ్డుకు రూ.40కోట్లు మంజూరు చేశామని త్వరితగతిన పనులు చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. బలగ ప్రాంతం నుంచి రద్దీ ఎక్కువగా ఉందని అక్కడ కట్టడాలు తొలగించాల్సి ఉందని, కొన్ని వాణిజ్య కూడళ్లు కలుపుకుని డే అండ్ నైట్ జంక్షన్ వరకూ పనులు చేస్తున్నామన్నారు. జిల్లా జడ్జి నివాసానికి సంబంధించి గోడ కూడా తొలగించాల్సి ఉందన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సంబంధించిన గోడ కూడా కూల్చాల్సి ఉందని, వీటి స్థానంలో కొత్త వాటి నిర్మాణానికి దీనికి మున్సిపల్ నిధులు కేటాయించామన్నారు. కొన్ని చోట్ల జనావాసాలు ఉన్న చోట్ల అభ్యర్థన మేరకు డబ్బై అడుగుల మేరకు రోడ్డు ఉంటుందని మిగిలిన చోట ఎనభై అడుగుల రోడ్డే వేయనున్నామన్నారు. మంత్రితో పాటు జిల్లా రైతు విభాగం అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేశు,ఆర్అండ్‌బీ ఎస్ఈ సుధాకర్, ఈఈ రవి నాయక్, డీఈ గణపతి, ఏఈఈ రాజు, సాదు వైకుంఠరావు, చిట్టి జనార్ధన రావు, అల్లు లక్ష్మి నారాయణ, రెడ్డి చిరంజీవులు, బాన్న రమణ, గణపతి పట్నాయక్, గుండ హరీష్, ఆలుగుబెల్లి నాగభూషణరావు, ఎండ రమేష్, సీర సత్యం, టంకాల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంట్రాక్ట్ అధ్యాపకులు



మంత్రి అప్పలరాజును కలిసిన జిల్లా కాంట్రాక్టు అధ్యాపకులు

కాశీబుగ్గ: జిల్లాలోని వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును ఆదివారం కలిశారు. పలాస మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద కలిసి ధన్యవాదాలు తెలిపారు. అయితే 2014 జూన్ 2వ తేదీ నాటికి ఐదేళ్ల సర్వీసు ఉండాలన్న నిబంధన వల్ల సుమారు 1900 మంది నష్టపోతున్నారని మంత్రికి తెలిపారు. వారిజీవితాల్లోనూ వెలుగులు నింపాలని కోరారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు సంఘ జిల్లా నాయకులు హనుమంతు రామ్మోహన్‌దొర, కె.తిరుపతిరావు, కె.విజయ్‌కుమార్, ఎస్.వీరన్నాయుడు, ఎ.శ్రీనివాసరావు, వై.కృష్ణకుమారి, రామరాజు, వివిధ కళాశాలల అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

జెడ్పీ ఛైర్‌పర్సన్ విజయకు అస్వస్థత



కిమ్స్‌లో చికిత్స పొందుతున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ విజయ

అరసవల్లి, కవిటి: జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పిరియా విజయ ఆదివారం అస్వస్థతకు గురయ్యారు. ఇటీవల వరుసగా కార్యక్రమాలతో ఆమె చాలా బిజీగా కార్యకలాపాలను నిర్వహించారు. దీంతో జిల్లా కేంద్రంలోని జెడ్పీ అధికారిక బంగ్లాలోనే ఆమె కొద్దిపాటి అనారోగ్యానికి గురయ్యారు. దీంతో ఆమెను జిల్లా కేంద్రంలోని కిమ్స్‌లో చేర్పించి చికిత్స అందించారు. ప్రస్తుతానికి ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని కిమ్స్ వైద్యులు గూడెన సోమేశ్వరరావు తెలియజేశారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్‌రామన్ తదితర అధికారులు ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పిరియా విజయ భర్త పిరియా సాయిరాజ్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

'ప్రతిభావంతులకు సన్మానం'



నీట్ టాపర్ వరుణ్ చక్రవర్తిని సన్మానిస్తున్న ధర్మాన కృష్ణదాస్, తదితరులు

నరసన్నపేట: పలు పోటీ పరీక్షల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన జిల్లా విద్యార్థులు సిక్కోలు ఖ్యాతిని ఇనుమడింపజేశారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో వెలమ ఆత్మగౌరవ వేదిక సమితి ఆధ్వర్యంలో సివిల్స్, నీట్ విజేతలను ఆదివారం సత్కరించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సివిల్స్ విజేత బైరి సంతోష్ కుమార్, నీట్ మొదటి ర్యాంకర్ వరుణ్ చక్రవర్తి, ఐఐటీ ర్యాంకర్ నక్క తన్మయ్‌రాఘవ, డీఈఈ సెట్ ర్యాంకర్ చల్ల లిఖిత, ఇంటర్‌లో 988 మార్కులు పొందిన గుండ మౌనికలను సన్మానించారు. వీరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ సిక్కోలు ప్రతిభను చాటారని అభినందించారు. కార్యక్రమంలో వెలమ ఆత్మగౌరవ వేదిక అధ్యక్షుడు పాగోటి రాజారావు, కార్యదర్శి గొద్దు, చిట్టిబాబు, ట్రెజరర్ పొన్నాడ గణేష్, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు మెండ రాంబాబు, ముద్దాడ బైరాగినాయుడు, ముద్దాడ బాలభూపాలనాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్రగాయాలతో పాదిలాపు భాస్కరరావు

ఎల్ఎన్ పేట: మండలం కేంద్రం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రావిచంద్రి గ్రామానికి చెందిన పాదిలాపు భాస్కరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. భాస్కరరావు ద్విచక్ర వాహనంపై యంబరాం రోడ్డువైపు ప్రయాణిస్తుండగా వాహనం అదుపు తప్పడంతో రహదారిపై పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. స్థానికులు 108కు సమాచారం అందించడంతో 108 ఈఎంటీ శివాజీ, పైలెట్ రమణలు ఆయనకు ప్రథమ చికిత్స చేసి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాగోలు జెమ్స్‌కు తరలించారు.

'మిల్లు నిర్మించండి.. లేదంటే మా భూములివ్వండి'



మిల్లు గోడౌన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

నరసన్నపేట: స్థానిక శ్రీ శాలివాహన కో ఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్లు మహాజన సభ రసాభాసగా మారింది. తామరాపల్లి సమీపంలోని శ్రీ శాలివాహన మిల్లు ప్రాంగణంలో ఆదివారం బోర్డు మహాజన సభను నిర్వహించింది. సభ ప్రారంభమైన కొద్ది సమయం తర్వాత తామరాపల్లి, జమ్ము, శివరాంపురాలకు చెందిన రైతులు వచ్చి సభను అడ్డుకున్నారు. మిల్లు నిర్మాణానికి 40 ఏళ్ల కిందట తమ భూములను విరాళంగా ఇచ్చామని, ఇప్పటికీ మిల్లు నిర్మించకపోగా మిషన్ల కొనుగోలు పేరిట తాము ఇచ్చిన భూములను అమ్మేయడానికి చూస్తున్నారని ఆరోపించారు. బోర్డు చైర్మన్ ఏకపక్షంగా విక్రయానికి చూస్తున్నారని రైతులు చింతు మోహనరావు, గొద్దు చిట్టిబాబు, పల్లి లక్ష్మణరావు, గెంబలి ప్రభాకరరావు, ధర్మాన తవిటినాయుడు, గొద్దు మునలయ్యలు ప్రశ్నించారు. మిల్లు నిర్మించి తమకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని, లేదంటే తమ భూములను తిరిగి ఇచ్చేయాలని, అలాకాకుండా అమ్మేయాలని చూస్తే అంగీకరించబోమని ధర్నాకు దిగారు. ఈ దశలో తామరాపల్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు ముచ్చ గణేష్ రైతులతో వెళ్లి బోర్డు చైర్మన్ మంచు కృష్ణారావును నిలదీశారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని మిషన్లు కొనాలని, భూములు విక్రయించడం సబబు కాదని అన్నారు. దీంతో సభను అర్ధంతరంగా నిలిపివేశారు.

ఈ బోర్డు ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తోందని వైఎస్సార్ సీపీ వీవర్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడు మంచు చంద్రయ్య తదితరులు మండిపడ్డారు. చంద్రయ్య మాట్లాడుతూ స్పిన్నింగ్ మిల్లు నిర్వహణకు అనేక మార్గాలు ఉన్నాయని అన్నారు. మిల్లు భూములు అమ్మి డబ్బులు కొట్టేయడానికి కొందరు చూస్తున్నారని ఆరోపించారు. శాలివాహన స్పిన్నింగ్ మిల్ చైర్మన్ మంచు కృష్ణారావు మాట్లాడుతూ చేనేత కార్మికుల ప్రయోజనానికి, స్పిన్నింగ్ మిల్లు నిర్వహణకు నిధులు అవసరమని భావించి భూములు విక్రయించడానికి తీర్మానం పెట్టామని, తన వ్యక్తిగత స్వార్థం ఏమీ లేదని, సభ్యులు సహకరించాలని కోరారు.

'తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం'

సోంపేట: తీర ప్రాంతాన్ని ఏపీ టూరిజం ద్వారా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని మత్స్యశాఖ ఆంధ్రా విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ టి.సుగుణ అన్నారు. బారువ తీర ప్రాంతాన్ని మత్స్యశాఖాధికారులతో కలిసి ఆదివారం ఆమె పరిశీలించారు. తీర ప్రాంతం టూరిజం ద్వారా అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లా మత్స్యశాఖాధికారి ఎన్.నారాయణరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.ఆనంద్, అదనపు డైరెక్టర్ టి.సంతోష్, తదితరులు ఉన్నారు.



బారువ తీర ప్రాంతంలో మత్స్యశాఖ అధికారులు